https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 / సంచిక:24 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / బుధవారం, సెప్టెంబర్ 09,2026

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..

## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ




ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# రేవంత్‌రెడ్డి ఒక్కసారి ముఖ్యమంత్రే..

## మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్ పార్టే : సంజయ బారు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09



రేవంత్ రెడ్డి ఒక్కసారి ముఖ్యమంత్రేనని, ఆయన మళ్లీ గెలువడని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు సంజయ్ బారు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని చెప్పారు. ఈసారి బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని అంచనా వేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అసమర్థ, అరాచక పాలనతో జనం విసిగిపోయారు. ఎక్కడ చూసినా ప్రభుత్వంపై వ్యతిరేకతే వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో సంజయ్ బారు పోస్టు చర్చనీయాంశ మైందిరేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలు ఇచ్చారు. ముఖ్యంగా రైతుబంధును రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతా అన్నారు. కానీ రూ.12 వేలు అందించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఆఖరికి ఆ రూ.12 వేలు కూడా ఇవ్వడంలేదు. కళ్యాణలక్ష్మి పథకం కింద నగదుతోపాటు తులం బంగారం కూడా ఇస్తామని చెప్పారు. తులం బంగారం సంగతేమోగానీ ఆ కళ్యాణలక్ష్మి నగదుకే దిక్కులేదు. ఇంతవరకు రైతుబీమాకు ప్రీమియం కూడా చెల్లించలేదు.బీఆర్ఎస్ హయాంలో 24 గంటలు కరెంటు ఉండేది. కానీ ఇప్పుడు పల్లెల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉన్నది. ఆసరా పింఛన్‌లు రూ.2 వేల చొప్పున పెంచుతామని హామీ ఇచ్చి ఇంతవరకు పెంచనే లేదు. రైతుల పంటలను సకాలంలో కొనుగోలు చేయడంలో కూడా రేవంత్ సర్కారు విఫలమైంది. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే సంజయ బారు తన విశ్లేషణను వెల్లడించడం విశేషం



# తిరుపతి యూనివర్సిటీ కల నెరవేరింది..

## ఇక వైజాగ్, గుంటూరులో కాలేజీలు పెట్టాలి: మల్లారెడ్డి

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మల్లారెడ్డి

యూనివర్సిటీకి పర్మిషన్ రావడంతో మొక్కు చెల్లించుకునేందుకు వచ్చానన్న మల్లారెడ్డి

తాను ఏది అడిగినా స్వామివారు అనుగ్రహిస్తున్నారని వ్యాఖ్య

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత మల్లారెడ్డి ఈరోజు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన 74వ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారికి చేసుకున్న ఒక ప్రత్యేక మొక్కు తీరడంతో స్వామివారి దర్శనానికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన మల్లారెడ్డి... విద్యా రంగంలో తన నూతన విస్తరణ ప్రణాళికలు, శ్రీవారిపై తనకున్న భక్తిప్రపత్తులను పంచుకున్నారు."తిరుపతిలో మా మల్లారెడ్డి విశ్వవిద్యాలయానికి అనుమతులు లభిస్తే కొండపైకి మోకాళ్లపై వచ్చి గుండు కొట్టించుకుంటానని స్వామివారికి మొక్కుకున్నాను. ఆ వడ్డీకాసులవాడు దయతలిచి నా కోరిక నెరవేర్చాడు. పర్మిషన్ రావడంతో నా మొక్కు చెల్లించుకోవడానికి ఇక్కడకు వచ్చాను. నేను ఏది అడిగినా స్వామివారు వెంటనే అనుగ్రహిస్తున్నారు" అని మల్లారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంత విద్యార్థులకు ఏఐ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చామని మల్లారెడ్డి తెలిపారు. 70 ఏళ్లుగా ఇంజనీరింగ్ విద్య ఉన్నప్పటికీ, ప్రస్తుత సాంకేతిక విప్లవానికి అనుగుణంగా విద్యార్థులకు ఏఐ, స్కిల్స్ నేర్పించి గ్లోబల్ ఇంజనీర్లుగా తీర్చిదిద్దుతామన్నారు. భవిష్యత్తులో వైజాగ్, గుంటూరు ప్రాంతాల్లో కూడా తమ విద్యాసంస్థలను నెలకొల్పేందుకు శ్రీవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.

# కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు: మహేశ్ గౌడ్



- కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్
- కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి
- కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ

- సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు
- హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని వ్యాఖ్య

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు.సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు.కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు.కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# శేఖర్ కమ్ముల హీరోలంటే నాకు నచ్చరు: సందీప్ రెడ్డి వంగా



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్' (జుజూఅఎ). '90'o' వెబ్ సిరీస్ ఫేమ్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన సందీప్ వంగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఈ వేడుకలో భాగంగా 'ఎపిక్' టీజర్‌లో ఉన్న ఒక విలక్షణమైన డైలాగ్‌పై ఆసక్తికర చర్చ నడిచింది. చిత్రంలో "ఇది శేఖర్ కమ్ముల సినిమాలో హీరో లాంటి అబ్బాయికి, సందీప్ రెడ్డి వంగా సినిమాలో హీరో లాంటి అమ్మాయికి మధ్య జరిగే ప్రేమకథ" అనే డైలాగ్ ఉంది. ఈ సంభాషణపై యాంకర్ సుమ అడిగిన ప్రశ్నకు సందీప్ వంగా తనదైన శైలిలో స్పందించారు.ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను.. నాకు శేఖర్ కమ్ముల సినిమాల్లో హీరోలు అసలు నచ్చరు. అయితే, ఆయన చిత్రాల్లోని హీరోయిన్ల పాత్రలు మరియు వారి డిజైనింగ్ మాత్రం అద్భుతంగా ఉంటాయి. 'ఎపిక్' టీజర్‌లో ఈ డైలాగ్ వినడానికి ఎంతో ఆసక్తికరంగా అనిపించింది. శేఖర్ కమ్ముల హీరో లాంటి అబ్బాయి, నా సినిమాల్లోని హీరో లాంటి అమ్మాయి కలయిక అనే కాన్సెప్ట్ సినిమాపై అంచనాలను పెంచేసింది అని పేర్కొన్నారు. భిన్నమైన ఆలోచనాధోరణి, విభిన్నమైన క్యారెక్టరైజేషన్లతో టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శేఖర్ కమ్ములపై సందీప్ వంగా చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సినీ వర్గాల్లోనూ, నెట్టింటనూ హాట్ టాపిక్‌గా నిలిచాయి.

## ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం లకీలక ప్రకటన..

# కేంద్రానికి మద్దతు

20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్

తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి

ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09


ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. “ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు” అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.



## టిబెట్‌లో మళ్లీ భూకంపం.. నేపాల్‌లోనూ ప్రకంపనలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

టిబెట్ లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో పొరుగు దేశమైన నేపాల్ లోనూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టర్ స్కేలు పై ఈ భూకంప తీవ్రత 5.3 గా నమోదైంది. యూరోపియన్-మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ వెల్లడించింది. భూ అంతర్భాగంలో 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు ఈ సంస్థ పేర్కొన్నది. కాగా భారత జాతీయ భూకంప పరిశోధన కేంద్రం మాత్రం భూకంప తీవ్రతను 5.0 గా నిర్ధారించింది. టిబెట్‌లో సంభవించిన ఈ భూకంపం కారణంగా నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించడంతో, భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం వల్ల సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన అధికారిక వివరాలు ఇంకా వెలువడాల్సి ఉంది. గత గురువారం కూడా టిబెట్‌లో భూకంపం సంభవించింది. అప్పట్లో దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1గా నమోదైందని, భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు యూఎస్



## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త.. పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

పీఆర్‌సీ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా కీలక అడుగు

నివేదిక త్వరగా ఇవ్వాలని పీఆర్‌సీ ఛైర్మన్‌కు సీఎస్ లేఖ

రెండో పీఆర్‌సీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో నిర్ణయం

బకాయి డీఏల విడుదలపై ఉద్యోగుల నుంచి డిమాండ్లు

ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగ సంఘాల ఒత్తిడి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. 2వ వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరారు. ఈ మేరకు రెండో పీఆర్సీ ఛైర్మన్ ఎన్. శివశంకర్‌కు లేఖ రాశారు. గతంలో నియమించిన రెండో వేతన సవరణ కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో



ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పీఆర్‌సీ అమలుపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. బకాయి ఉన్న డీఏలు విడుదల చేయాలని, పీఆర్‌సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాలపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పీఆర్‌సీ కమిషన్ వేగంగా నివేదిక సమర్పిస్తే.. దాని ఆధారంగా ఉద్యోగుల వేతన సవరణపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కమిషన్ నివేదిక అందిన తర్వాత ఫిట్‌మెంట్, వేతన సవరణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పీఆర్‌సీ ప్రక్రియపై ఉద్యోగుల్లో మరోసారి ఆశలు నెలకొన్నాయి.

## పోలీసులు దాడి చేసిన తీరును

# గవర్నర్‌కు వివరించాం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

అసెంబ్లీ ముందు మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేసిన దాడి చేసిన తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆధ్వర్యంలో ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ లాంటి పరిస్థితిని వివరించడానికి వారిని సమయం అడిగాం.. మాకు సమయం ఇచ్చారు. వారికి మా పార్టీ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. వారికి చిన్న ఆరోగ్యసమస్య వచ్చింది.. వారు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా మా పార్టీ తరపున ఆకాంక్షను తెలియజేశామన్నారు. ఇవాళ ఈ రాష్ట్రంలో నెలకొన్ని అన్ని పరిస్థితులను గవర్నర్‌కు కూలంకషంగా మా పార్టీ శాసనసభ్యులు, శాసన మండలిలో ప్రతిపక్ష నాయకులు, ఉప నాయకులు, సీనియర్ నాయకులు అంతా కలిసి చాలా వివరంగా గవర్నర్‌కు చెప్పామన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనలో ప్రజలకు అన్యాయమే జరిగిందని నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలుపుతుంటే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులు దాడి చేసిన తీరును, తెలంగాణలో పరిస్థితులను గవర్నర్‌కు వివరించామన్నారు. శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిపై పురుష పోలీసుల దాడి వీడియోలను చూపించాం. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను తెలిపామన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగి దుశ్శాసనపర్వం ఎలా సృష్టించారో చెప్పామన్నారు. కేసీఆర్ చావు కోరుతూ ఎలా మాట్లాడారో గవర్నర్‌కు చెప్పామన్నారు.రాజకీయ వార్తలు చదవండి

### మేం చేసిన తప్పేంటి..?

రూల్స్ కు విరుద్ధంగా తమ ఎమ్మెల్సీలను ఎలా సస్పెండ్ చేశారో గవర్నర్ శుక్లాకు చెప్పామన్నారు కేటీఆర్ . గౌరవ సభ కాదది, కౌరవ సభ, శాసన సభ కాదు.. దుశ్శాసన సభ, అదే విషయాన్ని గవర్నర్‌కు వీడియోలతో సహా వివరించామన్నారు. సభ బయట అంశాలపై డీజీపీ, సీపీతో గవర్నర్ మాట్లాడతానన్నారని వెల్లడించారు. ఫామ్ హౌస్‌కు కాంగ్రెస్ గూండాలు ఎలా వెళ్లారో గవర్నర్‌కు చెప్పామన్నారు. రాహుల్ గాంధీ తరహాలోనే బ్లాక్ టీషర్ట్ వేసుకున్నాం. మేం చేసిన తప్పేంటి.. తెలంగాణలో పరిస్థితులను గవర్నర్ శుక్లాకు వివరించాం. రాష్ట్రంలో ప్రజలకే కాదు.. ప్రజా ప్రతినిధులకూ అవమానాలే ఎదురవుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు.



## తిరుమల భక్తులకు ఇకపై

# రూ.10 లక్షల బీమా

- భక్తుల ప్రమాద బీమా రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- సహజ మరణానికి రూ.2 లక్షల బీమా
- బీమా పథకానికి ఎల్ఐసీకి రూ.2.12 కోట్ల ప్రీమియం చెల్లింపు
- లడ్డూ తయారీకి 400 అదనపు పోస్టులకు ప్రతిపాదనలు
- ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి ప్లాంట్



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు09

శ్రీవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తూ మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని ‘తిరుమల తిరుపతి దేవస్థానం’ (టీటీడీ) బోర్డు నిర్ణయించింది. సహజ మరణం సంభవించినా రూ.2 లక్షలు అందించేలా గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయనుంది. దేశంలోనే తొలిసారిగా ఎల్ఐసీ ద్వారా ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది. తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరాలను వెల్లడించారు. భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. బీమా పథకం అమలుకు టీటీడీ నిధుల నుంచి ఎల్ఐసీకి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఈహెచ్ఎఫ్ సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు ఆమోదం తెలిపారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలు పెంచాలని నిర్ణయించారు. శ్రీవారి పోటులో లడ్డూల తయారీ వేగం పెంచేందుకు 400 అదనపు అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపనున్నారు. తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారు చేయనున్నారు. ఇందుకోసం ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను రూ.2.80 కోట్లతో జీపీఎస్ రెన్యువబుల్స్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి రవాణా ఛార్జీల కోసం మూడేళ్లకు రూ.1.60 కోట్లు కేటాయించారు. నారాయణవనం ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం చేయాలని నిర్ణయించారు. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం కోసం రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్స్ గడువును మరో మూడేళ్లు పొడిగించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆమోదించిన రూ.49 కోట్ల ఆర్థిక సహాయంలో రెండో విడతగా రూ.7.56 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు.